# 19. చెయ్యిజారని అదృష్టం

**రంగారావు** ఆనందంగా వున్నాడు. అతనికి పొద్దుట లేచిందగ్గిర్నుంచీ అలాగే వుంది. కాఫీ హోటల్లో సెర్వర్ అడిగీ అడగ్గానే వేడి వేడి ఇడ్లీ తెచ్చియిచ్చేడు. బస్సు స్టాండుకి రాగానే తన వూరికి వెళ్లే బస్సూ- అందులో నిండా జనంవున్నా తన కోసం ఖాళీగా వదిలిన ఫ్రంటు సీటూ దొరికాయి. అన్నీ అలా కలిసివస్తూ వుంటే చాలా ఆనంధంగా వుంటుంది.

కోరుకున్న దేదీ జీవితంలో జరగదు - అని అనుకున్నాకూడా తనకి ఇంత ఆలస్యంగా అయినా ఇంత మంచిమంచివి జరగడం ఆశ్చర్యమే మరి.

లేకపోతే ఈ బెజవాడకి ముప్ఫైమైళ్ళు యిటున్న నందిగామలో తను వుంటూ ఈ బెజవాడకే పద్దెనిమిది మైళ్ళు అటువున్న వుయ్యూర్లో కమలాకర్రావూ; అతని దగ్గిర ఒకప్పుడు తన ప్రాణానికి ప్రాణమై వుండిన అతని చెల్లెలు జానకీ వుండడం ...

ఆరేళ్ళబట్టి యిలాగే వుంటున్నా -

ఈ ఆరేళ్ళనుంచి దాదాపు నెలకో సారైనా తను బెజవాడ వస్తూవున్నా కూడా వాళ్ళు వుయ్యూర్లో వున్నారన్న సంగతి తనకి తెలియక పోవడం -

ఎంతాశ్చర్యం - ఎంతాశ్చర్యం! ఎనిమిదేళ్ళ క్రితం తనూ జానకీ విడిపోయినప్పుడు యింక మళ్ళీ కలుసుకుంటాం అనుకోలేదు - (అసలు విడిపోతామనే అనుకోలేదు!) అంతా ఆశ్చర్యకరంగానే జరిగింది.

తను గొప్ప పిరికివాడుగా, (తనకీ- ఎవరు కనిపెట్టగలిగితే వారికీ) నిదర్శనాలు దొరికి రుజువయి పోయింది. అయితే ఎవరూ కనుక్కోలేదు. తనే ఒక గొప్ప సాహసిగా సంస్కర్తగా జానకి దృష్టిలో కమలాకర్రావు దృష్టిలో నిల్చిపోడం... ఎంత ఆశ్చర్యం!

తను బియ్యేడీ చదువుతున్నప్పుడే జానక్కి వాళ్ళనాన్న పెళ్ళి నిశ్చయం చేసేడు. వార్త తెలియగానే తను రాజమండ్రి నించి ఏలూరుకి ఎగిరి వచ్చేడు. అక్కడికి ఆరుమైళ్ళ దూరం వున్న తన స్వగ్రామం...పల్లెటూరు వెళ్ళలేదు. ఆరాత్రి ఏలూర్లో వాళ్ళింట్లోనే మకాం చేసేడు.

ఆ రాత్రి....

జానకీ కమలాకర్రావూ తనూ - చూసిన సినీమాకే మరోసారి వెళుతున్నాం అంటూ బయల్దేరేరు. ఎక్కడికి వెళ్లేరు? పార్కుకి... అక్కడ విసుగుపుడితే పవరుపేట స్టేషనుకీ... అక్కణ్ణించి కాకా హోటలుకి.

"ఈ పెళ్లి ఎలాగేనా తప్పిపోతే బావుణ్ణు..."

అనిపించింది వాళ్ళ ముగ్గురికీనూ, ఆరాత్రి.

"తప్పించేద్దాం" అనుకోడానికి ఆ ముగ్గురికీ వయస్సు చాలదు. ఎంచేతంటే ఆ పెళ్ళి... వీళ్ళ ముగ్గురికీ కలిసివున్న ఏళ్ళకంటె రెండేళ్ళు ఎక్కువగా ఉన్న ఒకవ్యక్తి నిర్ణయించి నిశ్చయించిన పెళ్ళి... అతన్తో ఈ పెళ్ళి మా కిష్టంలేదండీ అని చెప్పడం ఈ సినీమాకి మరోమాటు వెళ్ళొస్తామండీ అని చెప్పడం లాంటిది కాదు.

తప్పిపోదు, తప్పిపోదు- ఈ పెళ్ళి చచ్చినా తప్పిపోదు అని నిజం తెలిసింది. వరద ఊళ్ళోకొచ్చి గుడిసెల్నీ కిళ్ళీ బడ్డీల్నీ తోసేసినట్టు నిజం కొట్టొచ్చినట్టు కొట్టొచ్చి వాళ్ళ ముగ్గురి ఆలోచనల్నీ కొట్టిపారేసింది.

కొంచెం వొడ్డున వున్నవాడు తనే.

అయినా తనకీ భయమే... జానకికేగాదు తండ్రి వున్నది. తనకీనూ. "ఈ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకుంటాన్నాన్నా" అంటే "వీప్పగల గొడతాను వెధవా! వెర్రి వేషాలు వెయ్యక దాన్నెక్కణ్ణుంచి తెచ్చేవో అక్కడ దింపిరా." అని ప్రయాణానికి అయ్యేటటువంటివి... ఛార్జీలుగాక ఒక అర్థరూపాయీ, టైముగాక మరో అరగంటా యిస్తాడు.

అయినా సరే "నువ్వే ఏదో ఊపాయం ఆలోచించాలోయ్" అన్నాడు కమలాకర్రావు. జానకి తలూపింది.

తనని వాళ్ళు హీరోగా భావించేరు.

"నాతోటి నువ్విలా గొచ్చెయ్యి. రాజమండ్రిలో వుండిపోదుగాని. ట్రెయినింగయి పోగానే ఎక్కడో వుద్యోగం చూసుకుందాం. మీ నాన్నకి నువ్వూ మా నాన్నకి నేనూ గుడ్‌బై కొట్టేద్దాం" అన్నాడు తను.

"అవునవును. రేపు సాయంత్రంలోగా జానకిని వెతుక్కొస్తానని నేను నింపాదిగా దాని చీరలూ అవీ పట్టుకొని రాజమండ్రీ వచ్చేస్తాను." అన్నాడు కమలాకర్రావు.

"అమ్మ బాబోయ్... నే రాను" అంది జానకి.

"బతికేన్రా భగవంతుడా." అనుకున్నాడు తను. కాని ఆశ్చర్యపోయినట్టు, కుంగిపోయినట్టు నటించేడు. 'ఇంతేనా నీకు నామీదున్న ప్రేమ ?' అని- జానకిని దూషించి దుర్భాష లాడేడు. లెక్చర్లిచ్చేడు. అసలు సంగతి తెలియకుండా జాగర్త పడ్డాడు.

అప్పుడే కాదు యిప్పుడూ ఆ మధ్యా యీ మధ్యా ఎప్పుడూ ఎక్కడా తన అసలు సంగతి ఎవరికీ తెలియకుండానే జాగర్త పడ్డాడు. అన్నీ అలా కలిసొస్తూ వుంటే మనం చేసేదేముంది. అసలు!

ఇప్పుడు తనక్కావలసిందీ అదే.. ఏదేనా కలిసొస్తే బాగుండును.

"ఏమిటోయ్. బ్యాంకుకు దయచేసేరు? ఇద్దరూ వచ్చేరే?!" అని తను పలకరింపుల య్యేక అన్నాడు.

"నువ్వు తియ్యడానికొచ్చేవే; అది మేం వెయ్యడానికొచ్చేం."

"మంచిదే. డబ్బు కూడబెడుతున్నారన్నమాట."

"కూడబెట్టడంకాదు. అదే అలా కలిసొస్తోంది."

"అంతేలే. ఇంతకీ ఏమిటి....ట?"

"ఏదో... ఇదీ వోరకం ముద నష్టమే. జానకి కొన్న ప్రెయిజ్ బాండు తన్నింది!"

"హాట్టీ కంగ్రాచ్యులేషన్స్..." ఆవేశంలో జానకి చెయ్యి షేక్హాండు కోసం పట్టుకొని నొక్కాడు.

జానకి బుగ్గల్లో ఎరుపులు పూశాయి. ఎంత ఆశ్చర్యం! జానకి తనంటే యింకా సిగ్గుపడు తోందా? తను ఆమెకి భర్త అయితే బాగుండునని జానకి యింకా కోరుకుం టోందా?

"జానకికి పెళ్ళయి వుండాలే!? మొగుడేం చేస్తున్నాడో? విడాకులిచ్చేసేడు గాబోలు. అలాగయితే ఎంత బాగుణ్ణు!"

అనుకుంటూ వుండగానే అనుకోకుండా అంతా చెప్పేశారు వాళ్ళు. జానకికి అనుకున్న ప్రకారం ఆ పెళ్ళి అయిందట. ఏడాది తిరక్కముందే- జానక్కి నచ్చకో మరెందువల్లో తెలీదుగాని... అతడు మంచివాళ్ళా కనబళ్ళేదు. ఇంకో యాడాది తిరగనే లేదు; ఆ "అర్ధాయిష్షు ముండాకొడుకు" ఓనాడు సాయంకాలం ఏడు గంటలకి వాకిట్లో మంచం వేసుకుని హాయిగా తలగడా పెట్టుకుని చల్లగాలి పీలుస్తూ అందులో ఎప్పుడు పీల్చేసేడో ఆఖరు శ్వాస పీల్చేసేడు. కొద్దిగా విచారించినా, జానక్కి ఏదో చెర వదిలినట్టు అయిందిగాని వైధవ్యం వొచ్చినట్టు లేదు. ఇప్పుడే బాగా కళకళ్ళాడుతూన్నట్టు కనబడుతోంది. పన్నెండు వేల ఆస్తి చేతికి దొరికిందిట. కొద్దిగా చదువుకుందిగా, చిన్న వుద్యోగం చేస్తున్నాదిట. చక్కగా పువ్వుల చీరకట్టుకుంది. గాజులూ నెక్లెసూ బొట్టూ అంతా ఫ్రెష్‌గా వుంది. పెళ్ళికానమ్మాయిలా వుందిగాని మరోరకంగా అనుకోడానికే వీల్లేదు.

అంతా తన అదృష్టం!

ఇప్పుడేకాదు. వాళ్ళతో వుయ్యూరు వెళుతున్నప్పుడే అనుకున్నాడు.

తనకి భార్యగా తటస్తపడ్డ మనిషి.. తల్చుకుంటేనే రోతగా వుంది. పేరు మాత్రం జగన్మోహిని ... చూడ్డానికి? హుఁ! కాలంనాడు కాకి అయినా అందంగా వుంటుందిట. కాని మోహిని మొహానికి అదీ లేదు!

పదివేలు కట్నం తెచ్చిందని నాన్న తనకి కట్టాడు యీ జగన్మోహిన్ని. పదివేలతోనూ మూడెకరాల పొగాకు నేల కొని గుంటూరు జిల్లాలో ఆయన గారు డబ్బు చేసుకుంటు న్నాడు. తనకి మిగిలింది నందిగామలో మేష్టరుగిరీ; నంది మొహంలాంటి జగన్మోహినీనూ. నాలుగేళ్ళై భరిస్తున్నాడు. ఇంకా ఎన్నాళ్ళు భరించాలో...

అంతా విధి వైపరీత్యం. ఆ రెండేళ్ళూ జానకి మొగుడు పోయేదాకా తను ఆగివుంటే?-

అయినా ఇప్పుడూ ఏమీ మించి పోయిందిలేదు. జగన్మోహినికి నెలలు నిండుతున్నాయి. డాక్టరు మొన్నీమధ్యే పరీక్షచేసి నిరాశగా చెప్పేడు. ఈవిడ శరీరత్వానికి ప్రసవం కావడం చాలా కష్టంకావచ్చునట. రక్తంలోనూ చర్మంలోనూ ఉండవలసినవేవో లేవుట... మందులు తెమ్మన్నాడు. రాసిచ్చేడు. అవి తేవడం కూడా ఈ ట్రిప్పులో వోపని.

అసలే పురుడు ఆడదానికి పునర్జన్మలాంటిది. అందులో తొలి కానుపు. శరీరతత్వం అదీ యిదీ అంటూ డాక్టరు ఏదో చెబుతూనే వున్నాడు. తన అదృష్టం ఎలా వుందో- రెండు నెలలాగితేసరి.

"ఆ మధ్య రాజశేఖర్రావు కనబడి నువ్వు పెళ్ళి చేసుకోలేదని చెప్పేడు." అన్నది జానకి.

గుండె గతుక్కుమంది. కాని అంతలోనే సర్దుకుంది. సూటిగా ప్రశ్న అడిగితే అబద్ధం చెప్పే ధైర్యం తనకుందా? ఏమో తరవాత విషయం జానకికి తెలియదేమో... తెలియకపోతే బాగుణ్ణు. ఎప్పటికీ తెలియకపోతే ఎంత బాగుణ్ణు!.. ఎలాగుంటుంది. ఎప్పటికీ తెలియకుండా?.. ఒకవేళ జగన్మోహిని ఈ ప్రసవబాధలో... అయితే కూడా తనవాళ్ళు తెలిసిన వాళ్ళూ ఊళ్లోవాళ్ళూ- ఇంతమందికి తెలుసే!... ఎలాగ?... ఎలాగో... అదెప్పటిమాట.. ఇప్పటికి తెలియకుండా ఉంటేచాలు, అప్పటిమాట అప్పుడే చూసుకోవచ్చును.

"పిచ్చివాడివి కాకపోతే- నామీద బెంగకొద్దీ పెళ్ళి మానుకుంటావుటయ్యా."

ఎంతదృష్టం- ఎంతదృష్టం!! తగుమాత్రం అనుభవం; గడుసుతనం- డబ్బు... నిగ్గుతేలిన

అందం- అన్నిటితోనూ జానకి తనదైతే- ఎంత బావుంటుంది?!

ఆవేళరాత్రి వుయ్యూర్లో తనకి డాబా మెట్ల ప్రక్క గదిలో మంచం వేసేరు. జానకి అటు వెళుతూవుంటే తనకి- ఈ ఆశ్చర్యం అదృష్టం. ఈ తర్జన భర్జనలమధ్య ఎంత ఆశ పుట్టింది!... దగ్గరిగా లాక్కుని "జానకీ! నా జానకీ!!"-అని గుసగుసలాడేడు...

"స్స్... ఇప్పుడుకాదు... ఒదులు..." అంటూ మెత్తగా తన చేతులమధ్య ముడుచుకుపోయింది జానకి.

"అమ్మా!.. ఇప్పుడే" అన్నాడు తను.

"ఛఛా! మతుందా లేదా?" అని విడిపించుకున్నది జానకి. డాబామీదికి పనిమీద వెళ్ళింది తిరిగొచ్చి; తను మంచంమీద దిగాలుపడి కూచుంటే - "ఓస్! ఈపాటిదానికేనా? నీకంత యిదిగావుంటే ఎప్పుడో ఓనాడు నందిగామ వస్తాన్లేవోయ్!"

"ఆఁ! నువ్వొస్తావా, నందిగామకి!?" ఆశ్చర్యం; భయం... ఒకవేళ వచ్చేస్తుందేమో. యెక్కడ దాచడం... బళ్ళో పిల్లలు నిక్‌నేమ్స్ పెట్టేస్తారు... ఏడిపించుకు తినేస్తారు.

"ఆఁ- రావాలంటే కష్టమా? బస్సు కూడా మారక్కర్లేదు. బందర్నించి జగ్గయ్యపేటెళ్ళే బస్సుందిగా!"

"నువ్వు- ఒక్కర్తివే వచ్చేస్తావా?"

"ఒక్కర్తినే కాకపోతే మా అన్నయ్య కొడుకుని వెంటబెట్టుకొస్తాను!"

నిర్ఘాంతపోయి కూచున్నాడు తను. మంచం అంచుదాకావొచ్చి తన మీదికి వొంగింది జానకి. "రాననుకున్నావేమో... నే రాననుకున్నావేమో" అని సినీమాలోపాట దీర్ఘంతీస్తూ తన జుట్టు చెరిపింది.

అబ్బ!- అలాటి క్షణాలు. ఎలా మరిచిపోవడం... అవి కోరకుండా వుండడం యెలాగ?... ఆ మెత్తదనం? ఆ జాణతనం- జగన్మోహిన్లో ఏవీ? బెల్లపు దిమ్మలా ఓ చోట పడుంటుంది... తేలిగ్గా డేగలా ఎగురుతూంది జానకి... ఇంతకీ అదృష్టం వుండాలి.

ఉన్నదేమో!?... అదృష్టం అందుబాట్లోకి రావాలంటే మానవ ప్రయత్నం కావాలేమో.

జానకి తనదైపోవాలంటే- జగన్మోహిని తప్పుకోవాలంటే - చిన్న ప్రయత్నం చెయ్యాలి. అంతే...

బాబోయ్! నావల్లకాదు...

డాక్టరుకి తెలుస్తుంది... నర్సులకి తెలిసిపోతుంది... నన్ను చంపేస్తారు. ఉరితీస్తారు ఉరి-ఉరి!

కలల్లో కనబడి వెంటాడి సాధిస్తుంది జగన్మోహిని. తనని సుఖపడకుండా చేస్తుంది రాక్షసి... ఈ చేత్తో మందు తాగిస్తే ఈ చేత్తో మళ్ళీ అన్నం తిననివ్వదు... ఈచేతినిండా ఇప్పుడే నెత్తురు మరకలు కనబడుతున్నాయేమిటి?

నేనిలాంటిది భరించలేను- అమ్మో! నేనలాంటి పనిచెయ్యలేను... నా అదృష్టం బావుంటే - దానంతట అదే - ఏదో... కాకపోతే బ్రతికే వుండనీ... ఎలాగో ఓలాగ అణగ్గొట్టొచ్చు.

రెణ్ణెల్లలో దానికి తొమ్మిదినెల్లు నిండుతాయి. తొమ్మిది నెలల్లో ఇరవై మూడేళ్ళు నిండుతాయి. ఇరవై మూడు- రెండున్ను మూడు అయిదు... అయిదు రెళ్ళుపది...పది పదులు నూరు- నూరేళ్ల ఎలా నిండుతాయి?" నిండినవాళ్ళు లేరా? ఎలాగయినా జరగొచ్చు.

కలిసొచ్చేకాలం అయితే నడిచొచ్చే కొడుకు పుడతాడు.

పుట్టనీ. అంత వరకు ఆగుతాను ...

అదిగో అదిగో నందిగాం... వొచ్చేస్తోంది ఇల్లు... బస్సు స్లోచేస్తున్నాడు. ఆ టర్నింగ్ దగ్గిర డేంజరు వుందని...

ఇంక టైమ్‌లేదు. టర్నింగు దాటగానే బస్సు ఆగుతుంది. ఆగిన ఐదు నిమిషాల్లో ఇల్లు. ఇంట్లో అడుగుబెట్టగానే జగన్మోహిని-

జగన్మోహిని జగన్నాయకిలా మీద బడుతుంది. నా మందులు తెచ్చేరా! బ్యాంకిలో వడ్డీ ఎంతయిచ్చేరు?... మొహమేం, అలా వుంది. రాత్తిరి సినీమాకి గట్రావెళ్ళేరా?... ఇన్నాళ్లుండి పోయారేం- మర్నాడే వస్తానన్నారుగా- ఇలాగ అలాగ అడుగుతూ, సణుగుతూ - కసురుతూ.

దానికదే జబ్బు. మామూలుగా మాట్లాడ్డంరాదు. అభిమానం అనురాగంలేవు. సరసం సంబరంలేవు. చుట్టూరా కమ్ముకుపోతుంది.

మంచి ఆలోచన కూడా చేసుకుందికి వీల్లేదు. జగన్మోహిని ఎదట వుంటే జానకిని గురించి ఆలోచించగలనా?... ఈ ఆలోచన్లిక్కడే చచ్చిపోవాలి.. ఆనందంగా సుఖంగా వుండడానికి వీల్లేదు. చావాలి.

ఎవరు చావాలి?... ఎవరు చస్తేనేమి? జానకి నాదికావాలి... పన్నెండు వేల ఆస్తి ... ప్రయిజ్ బాండుడబ్బు- నెలకి నూటయాభై ఉద్యోగం- అందం- గడుసుతనం, చలాకీతనం - అన్నీ నావి-

జానకినాది. డబ్బునాది... జగన్మోహిని- ఏమో! నాకుతెలీదు- దేవుడి కెరుక, దేవుడిదే అయిపోతే బాగుణ్ణు.

**ఢాం!...!!!...ఫెళఫెళ...**

**బడబడ... గర్ గర్...**

అయ్యో అయ్యో- నే చచ్చిపోతున్నాను కాబోలు... ఇంకేముంది. అంతా అయిపోయింది. ఈ దిక్కుమాలిన బస్సు నా ప్రాణాన్ని బలిగోరింది... వెధవ ఫ్రంటుసీటుకి ఆశపడి ఇక్కడికొచ్చి కూచున్నాను. వెనకవాళ్ళంతా బాగుపడ్డారు. .. అంతా బాగున్నారు... నా పెళ్ళాం జగన్మోహిని కూడా కులాసాగా వుంది.. మూడు రోజుల్లో - ఇదంతా మర్చిపోతుంది- దుష్టురాలు.. మా జాయింట్ లైఫ్ పాలిసీ పన్నెండు వేలూ ఇన్సూరెన్సు వాళ్ళనించి వొసూలు చేస్తుంది. మా నాన్నదగ్గిర ఆ మూడెకరాలనేలా ముక్కుపిండి లాగుతుంది. ఈ రోజుల్లో నీతా. జాతా? మరోణ్ణి పెళ్ళాడ్తుందేమో కూడాను... అయిపోయింది, నేనైపోయాను...

✤ ✤ ✤

అమ్మోయ్, బాబోయ్- అయ్యో నాయనో - బస్సు- సూడండిబాబూ అయ్యయ్యో ఎట్టయిపొయ్యిందో- కరెంటు పోలికి ఢీకొట్టేసింది... అట్నుండి లారీ వొస్తావుంది... ఈ టర్నింగుకాడ ఎప్పుడూ యిట్టాగే... లారీ డయివోర్లకి కళ్ళు గనపడిసావవు... పిలండి పిలండి. ఆ డాక్టర్ను పిలండి పోలీసోళ్ళను పిలండి... పాపం బస్సు డయివోరు జాగర్తగానే తోలుతుండాడు... లారీవోడిదే తప్పు- ఎవురన్నా జీపులో బోతే దొరుకుతాడు... తప్పించుకు పారిపొయ్యాడా?... కాక యీడనెకూకుంటాడా? ఆఁ ఎంతదూరం బోతాడ్లె. కంచికచెర్లలోగా బట్టుకోరూ!

ఏందీ? డ్రైవోరు జచ్చిపోయ్యాడా? అయ్యోపాపం- ఇదేదో గుండెల్లో మట్టసంగ దిగబడి పొయ్యింది ఇంకెట్ట బతుకుతాడు.. ఈ పక్క ఒంటిసీటుమీద ఈ దౌర్భాగ్యు డెవుడు! సీసప్పెంకులు మొగంమీద దిగబడ్డాయట్టుంది. లేవదియ్యండి... ఊపిరుందాసూడు.. ఈవూరోడేనయ్యా... మేస్త్రు.. ఆళ్ళ తాలూకోళ్లంటే రామనండి. రంగారావు మేస్త్రయ్యా... పక్క బజార్లోనేగా అల్లిల్లు.. బార్యా ఉంటది. యెళ్ళండి... సెప్పండి.

✣ ✣ ✣

"అమ్మాయీ! ఏం ఫరవాలేదు... మీ ఆయనకళ్ళు తెరుస్తాడు... మొహం మీద రెండు పెద్ద పెద్ద గంట్లు పడతాయి తప్పిస్తే మరేం భయంలేదు... ఏంచేస్తాం, కొందరికి మనస్సులో వుంటాయి గంట్లు . అంతకంటే నయం కదమ్మా- ఏడవకు - నువ్వు అదృష్టవంతురాలివి... అతను కళ్ళు తెరిచేవేళకి ఆనందంగా కనబట్టం మంచిదమ్మా" అంటున్నాడు డాక్టరు.

"నే నేడవడంలేదండీ! - నేను సంతోషంగా వున్నాను బాబూ, నాకు మళ్ళీ జన్మయిచ్చేరు... ఆయన కళ్ళు తెరవకపోతే నేనింకా యెక్కడుంటాను తండ్రీ. నేను చచ్చిపోకుండా ఆపేరు బాబూ తమరు... నేనెందు కేడుస్తాను. నానోములు వృథాపోలేదు. నా జన్మ దండుగ కాలేదు. నా బిడ్డకి అమ్మా నాన్నేడే అంటే చూపించడానికి నా దేవుడువున్నాడు. మొహంమీద రెండు గంట్లు వుంటాయని నే బాధపడతానను కుంటున్నారా? మీరన్నట్లు మనస్సులో లేవుకదండీ అవి.... నాదే అదృష్టం నాయనా. నాదేభాగ్యం. ఆయన కళ్ళు తెరిచే వేళకి నేను సంతోషంగా మీ అందరికీ దండాలు బెడుతూ ఆనందంగా ఆయన కాళ్ళకి మొక్కుతూ ముక్కోటి దేవతలికి పదివేల నమస్కారాలు చేస్తూ వుంటాను తండ్రీ"- అంటోంది జగన్మోహిని.

"లేదు మోహినీ- నేను నిన్ను తప్ప యెవర్నీ మనస్సులో కూడా కోరుకోను జానకి నాకొద్దు. నువ్వు చాలు. నేచేసిందంతా వెధవాలోచన. నే కన్నదంతా దుష్టస్వప్నం కాదు కాదు; దుష్టుని యొక్క స్వప్నం- నేను దుర్మార్గుణ్ణి. నన్ను క్షమించు." అందామనుకున్నాడు రంగారావు; కళ్ళు తెరిచిన వెంటనే-

కాని అప్పటికే అతనికి స్పృహ వచ్చేసింది. మేలుకున్నంతసేపు అతను కలలు కనడం మానడు.

☼

***("జ్యోతి" మాసపత్రిక : అక్టోబరు 1969)***

*__1966__లో నేను నాగార్జున సాగర్ ప్రాజెక్టులో పనిచేస్తూ నరసారావుపేటలో ఉన్నప్పుడు మా జీతాల బిల్లులూ అవీ పాస్ చేసే ఒక అధికారి కుమార్తె (బి.ఏ. విద్యార్థిని) ఈ ఇతివృత్తంతో రాసిన కథ చదవడానికీ ప్రచురించడానికీ బాగులేదని మొత్తం అంతా తిరగా రాసేను. తీరా రాసేక ఇందులో తను రాసింది అసలేమీ లేదుకనక నా రచనగానే ప్రచురించడం మంచిదని ఆ అమ్మాయి అన్నది.*

*ఐతే, __1970__లో నేనొక నవల రాద్దామనుకుంటున్న రోజుల్లో ఆ అమ్మాయి తన భర్తతో సహా విశాఖపట్నం వచ్చి; ఆ నవలను నేను డిక్టేషన్ చెప్పగా అంతా తను రాసింది. అంతా అయిపోయాక; 'ఇందులో మీరు రాసిందేమీ లేదు కనక నా పేరుమీద అచ్చువేసుకుంటున్నాను' అని చెప్పి ఉడాయించింది.*

*ఈ సంగతి తెలిసిన ఒక సీనియర్ రచయిత ఇదే ఒక ఇతివృత్తంగా తీసుకొని కథరాసి ప్రచురించేరు!*